
సాక్షి

శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు

ఆదివారం । 27 । అక్టోబర్ । 2024



సోమశిలలో 63.598 టీఎంసీలు

సోమశిల: జలాశయంలో శనివారానికి 63.598 టీఎంసీల నీరు నిల్వ ఉంది. పై నుంచి 21,073 క్యూసెక్కుల వరద వచ్చి చేరుతోంది. ఉత్తర కాలువకు 300, కండలేరుకు 10 వేల క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు.



బంగారం ధరలు

24 క్యారెట్లు (10 గ్రా)	రూ.81,320
22 క్యారెట్లు ఆర్నమెంట్ (1గ్రా)	రూ.7,360
3 శాతం జీఎస్టీతో	రూ.7,581
సవర (8 గ్రా)	రూ.60,648

గరిష్టం/కనిష్టం
36.4 /25.5

వాతావరణం

జిల్లాలో ఆదివారం వాతావరణం పొడిగానే ఉంటుందని, ఉష్ణోగ్రత కొంచెం పెరిగే అవకాశం ఉందని ఆ శాఖ అధికారులు తెలిపారు. గాలిలో తేమ 61 శాతంగా శనివారం నమోదైంది.

న్యూస్‌రీల్

ముగ్గురు విద్యార్థుల డిబార్

వెంకటాచలం: విక్రమసింహపురి యూనివర్సిటీ (వీఎస్‌యూ) పరిధిలోని అనుబంధ కళాశాలల్లో శనివారం నిర్వహించిన డిగ్రీ ఐదో సెమిస్టర్ పరీక్షల్లో ముగ్గురు విద్యార్థులు డిబార్ అయ్యారని పరీక్షల నిర్వహణాధికారిణి డాక్టర్ ఆర్.మధుమతి ఒక ప్రకటనలో తెలిపారు. మొత్తం 7,197 మంది విద్యార్థులకు 6,698 మంది హాజరు కాగా, 499 మంది గైర్హాజరయ్యారని తెలిపారు. కృష్ణచైతన్య డిగ్రీ కళాశాలలో ఒక విద్యార్థి, విడవలూరులోని పీఆర్ ఆర్ అండ్ వీఎస్ గవర్నమెంట్ డిగ్రీ కళాశాలలో ఇద్దరు విద్యార్థులు డిబార్ అయ్యారని తెలిపారు.

వచ్చే నెల 4వ తేదీ నుంచి డీఎల్‌డీఈడీ పరీక్షలు

నెల్లూరు (టౌన్): వచ్చే నెల 4 నుంచి 7వ తేదీ వరకు డీఎల్‌డీఈడీ పరీక్షలు జరగనున్నట్లు డీఈఓ బాలాజీరావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. పరీక్షలు ఉదయం 9 నుంచి 11.30 గంటల వరకు జరుగుతాయన్నారు. ఇందుకు పరీక్షార్థులు సంసిద్ధంగా ఉండాలన్నారు.

జిల్లాకు రూ.1.20 కోట్ల నాన్ జ్యుడీషియల్ స్టాంప్స్

నెల్లూరు సిటీ: నెల్లూరు జిల్లా స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ కార్యాలయానికి రూ.1.20 కోట్లు విలువ చేసే రూ.50, రూ.100 డినామినేషన్ నాన్ జ్యుడీషియల్ స్టాంప్స్ వచ్చినట్లు శనివారం జిల్లా రిజిస్ట్రార్ వర్మ తెలిపారు. సోమవారం అన్ని సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాలకు పంపిణీ చేయనున్నట్లు పేర్కొన్నారు.

శైవక్షేత్రాలకు ఆర్టీసీ ప్రత్యేక బస్సులు

నెల్లూరు సిటీ: కార్తీకమాసంలో భక్తులు ప్రముఖ ఐదు శైవ క్షేత్రాలను సందర్శించేందుకు వీలుగా ఏపీఎస్‌ఆర్టీసీ నెల్లూరు నుంచి ప్రత్యేక ప్యాకేజీలతో బస్సులను ఏర్పాటు చేసినట్లు నెల్లూరు డిపో–1 మేనేజర్ మురళీకృష్ణ శనివారం ప్రకటనలో తెలిపారు. అమరావతి, భీమవరం, పాలకొల్లు, ద్రాక్షారామం, సామర్లకోట ప్రాంతాలకు (ప్రతి ఆదివారం) నవంబర్ 3, 10, 17, 24 తేదీల్లో ఉదయం 9 గంటలకు నెల్లూరు నుంచి బయలు దేరుతుందన్నారు. సూపర్ లగ్జరీ బస్సుకు రూ.2,500 రాను, పోను ప్యాకేజీ అందుబాటులో ఉంచినట్లు తెలిపారు. ప్రయాణికులకు మినరల్ వాటర్ బాటిల్, పసుపు, కుంకుమ, బిస్కెట్ ప్యాకెట్ ఇవ్వనున్నట్లు తెలిపారు. ప్రయాణికులు టికెట్లను ప్రధాన బస్టాండ్‌లో కానీ, ఆర్టీసీ ఆథరైజ్డ్ ఏజెంట్ వద్ద నుంచి పొందగలరన్నారు.

అరుణాచలానికి..

మహాపుణ్యక్షేత్రాల్లో ఒకటైన అరుణాచలానికి నెల్లూరు డిపో–1 నుంచి 3, 9, 10, 14, 17, 24 డిసెంబర్ 1వ తేదీల్లో ఉదయం 9 గంటలకు నెల్లూరు ప్రధాన ఆర్టీసీ బస్టాండ్ నుంచి బస్సులు బయలు దేరుతాయన్నారు. మరుసటి రోజు మధ్యాహ్నం 2 గంటలకు బయలుదేరి రాత్రికి నెల్లూరుకు చేరుకుంటాయన్నారు. సూపర్ లగ్జరీ బస్సు చార్జీ రూ.1,200గా నిర్ణయించినట్లు తెలిపారు. నవంబర్ 3వ తేదీ నుంచి ప్రతి రోజూ నెల్లూరు నుంచి శ్రీశైలానికి ప్రత్యేక బస్సును ఏర్పాటు చేసినట్లు తెలిపారు. సూపర్ లగ్జరీ బస్సులో రూ.670 చార్జీగా నిర్ణయించామన్నారు.

పెద్దాస్పత్రిలో తనిఖీలు



పెద్దాస్పత్రిలోని చిన్నపిల్లల విభాగంలో రోగులను పరామర్శిస్తున్న పద్మావతి

నెల్లూరు (అర్బన్): దర్గామిట్టలోని ప్రభుత్వ సర్వజన ఆస్పత్రి (పెద్దాస్పత్రి)లోని చిన్నపిల్లల విభాగం, ప్రసూతి ఆస్పత్రి విభాగాన్ని రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యురాలు పద్మావతి శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. వైద్యం అందుతున్న విధానాన్ని బాలింతలను అడిగి తెలుసుకున్నారు. ఆమె మాట్లాడుతూ డాక్టర్లు చిన్న పిల్లలకు నాణ్యమైన వైద్యం అందించాలని సూచించారు. అనంతరం నర్సింగ్ కళాశాల విద్యార్థినులతో మాట్లాడి వారికి అక్కడ కల్పిస్తున్న సౌకర్యాలపై ఆరా తీశారు.

జిల్లాకు 3న మందకృష్ణమాదిగ రాక

నెల్లూరు (వీఆర్సీసెంటర్): మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణమాదిగ వచ్చే నెల 3న జిల్లాకు రానున్నారని ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు ఉదయ్‌కృష్ణమాదిగ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎస్సీ వర్గీకరణపై సుప్రీంకోర్టు స్పష్టమైన ఆదేశాలు జారీ చేసిన నేపథ్యంలో భవిష్యత్ కార్యాచరణ ప్రకటిస్తారని తెలిపారు. ఎమ్మార్పీఎస్ నాయకులు, కార్యకర్తలు భారీగా హాజరై ఆయన పర్యటనను జయప్రదం చేయాలని కోరారు.



రీచ్‌లకు పచ్చ బాటలు

పెన్నానదిలో పచ్చ తోడేళ్లు మోహరించాయి. సోమశిల నుంచి ఇందుకూరుపేట వరకు ఉన్న నదిలో అడుగడుగునా రీచ్‌లు ఏర్పాటు చేసుకుని టీడీపీ నేతలు ఇసుక దోపిడీకి పాల్పడుతున్నారు. రీచ్‌ల్లోకి వెళ్లేందుకు ఎక్కడికక్కడ పెన్నానది కరకట్టను తవ్వేసి రాచబాటలు వేశారు. భవిష్యత్‌లో భారీ వరదలు వస్తే.. ఊళ్లకు ఊళ్లు కొట్టుకుపోయే ప్రమాదం ఉందని నదీ పర్యావరణ పరిరక్షణాధికారులు హెచ్చరిస్తున్నారు. ఒక పక్క జిల్లాలో ఇసుక కొరతతో నిర్మాణ రంగం కుదేలైపోయి, కార్మికులు ఆకలి కేకలు వేస్తున్నా.. మానవత్వం లేకుండా వ్యవహరిస్తున్నారు. కార్మికులు, ప్రతిపక్షాలు రోడ్డెక్కి ఆందోళనలు చేస్తుంటే.. మరో వైపు ఎవరికి వారు ఇసుకను యథేచ్ఛగా తీసుకెళ్లొచ్చని చంద్రబాబు కల్లబొల్లి మాటలు చెబుతూ ప్రజలను ఏమార్చుతున్నారు.

కరకట్టలు తవ్వేసి రహదారుల ఏర్పాటు

- ఊరూరా తమ్ముళ్ల గుప్పెట్లో ఇసుక రీచ్‌లు
- రాత్రి వేళల్లోనే లోడింగ్.. టిప్పర్‌కు రూ.15 వేలు
- రోజుకు వెయ్యి వాహనాల్లో ఇసుక అక్రమ రవాణా
- రెవెన్యూ, పోలీస్, మైనింగ్ అధికారులకు మామూళ్లు
- పెన్నా తీరం వెంబడి గ్రామాలకు పొంచి ఉన్న వరద ముప్పు
- గజగజ వణుకుతున్న ప్రజలు



చేజర్ల మండలం పడమటి కంభంపాడు వద్ద ఇసుక డంప్ చేసి టిప్పర్లకు లోడింగ్ చేస్తున్న దృశ్యం

సాక్షి ప్రతినిధి, నెల్లూరు: పెన్నా బేసిన్‌లో పచ్చనేతల ఇసుక దోపిడీకి ప్రభుత్వ పెద్దల నుంచి అధికార యంత్రాంగం వరకు సాగిలపడి సహకరిస్తున్నాయి. వీరి కబంధహస్తాల్లో చిక్కుకుని నది శల్యమవుతోంది. నదీ తీరం వెంబడి ఇరువైపులా ఊరికొక రీచ్ ఏర్పాటు చేశారు. ఈ రీచ్‌ల్లోకి వాహనాలు వెళ్లేందుకు వీలుగా నది కరకట్టలు తవ్వేశారు. గ్రావెల్‌తో రహదారులు నిర్మించారు. ఎక్కడికక్కడ కరకట్టలు ధ్వంసం అయిన పరిస్థితుల్లో పెన్నానదికి వరద పోటెత్తితే ఆయా గ్రామాలకు పెను ప్రమాదం తప్పదని పర్యావరణ, జలసంఘ నిపుణులు హెచ్చరిస్తున్నారు. అక్టోబర్, నవంబర్ నెలల్లో తుఫాన్లు, భారీ వర్షాలు వచ్చే అవకాశాలు ఉన్నాయి. వరదలు వస్తే తమ పరిస్థితి ఏమవుతుందని నదీ తీరం వెంబడి గ్రామాల ప్రజలు గజగజ వణికిపోతున్నారు.

ఐదేళ్లల్లో తవ్వాల్సిన ఇసుక ఐదు నెలల్లోనే..

పెన్నానదిలో ఇసుక లభ్యతను బట్టి నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ అనుమతి ఇస్తుంది. గడిచిన ఐదేళ్లలో ఎన్‌జీటీ ఇచ్చిన అనుమతికి మించి ఈ ఐదు నెలల్లోనే తవ్వేసినట్లు సమాచారం. గత ప్రభుత్వ హయాంలో ఎన్‌జీటీ పెన్నానదిలో ఐదు చోట్లే అనుమతి ఇస్తే.. నిర్దిష్టంగా తవ్వకాలు చేపట్టింది. టీడీపీ అధికారంలోకి వచ్చిన రోజు నుంచి పెన్నానదిలో ఊరూరా పచ్చనేతలు రీచ్‌లు ఏర్పాటు చేశారు. ఒక్క ఆత్మకూరు నియోజకవర్గ పరిధిలో సోమశిల నుంచి సంగం వరకు 17 చోట్ల రీచ్‌లు ఏర్పాటు చేసి ఇసుక తవ్వకాలు చేపడుతున్నారు. అక్కడి నుంచి ఇందుకూరుపేట వరకు మరో 15 చోట్ల ఇసుక రీచ్‌లు ఏర్పాటు చేసుకున్నారు. ప్రధానంగా పాట్టేపాళెం, మినగల్లు, పీకేపాడు, సంగం, ఇరువూరు రీచ్‌ల్లో రాత్రి వేళల్లో లోడింగ్ చేసి, విచ్చలవిడిగా ఇసుక అక్రమ రవాణా చేస్తున్నారు. ఈ స్థాయిలో ఇసుక తవ్వకాలు చేస్తున్నా.. జిల్లా ప్రజలకు మాత్రం ట్రక్కు ఇసుక దొరకడం గగనంగా మారింది. పగలు, రాత్రి తేడా లేకుండా ఇష్టానుసారంగా తవ్వకాలు చేస్తున్నారు. పర్యావరణ అనుమతులు లేకపోవడంతో ఇసుక తవ్వకాలకు యంత్రాలు ఉపయోగించకూడదనే నిబంధనలు కాల రాసి భారీ యంత్రాలు ఉపయోగించి రూ.కోట్ల దోపిడీ చేస్తున్నారు. రీచ్‌లను స్థానిక ఎమ్మెల్యేల అనుచరులు గుత్తాధిపత్యంలో ఉంచుకుని దోపిడీ చేస్తుంటే.. అధికార యంత్రాంగం ముఖం చాటేస్తోంది.

సర్వేపల్లి పరిధిలో..

సర్వేపల్లి నియోజకవర్గ పరిధిలో సూరాయపాళెం, విరువూరు రీచ్‌ల్లో ఇసుక దోపిడీ యథేచ్ఛగా సాగుతోంది. సూరాయపాళెం రీచ్‌లో డ్రెడ్జింగ్ విధానం ద్వారా డంపింగ్ యార్డుకు రవాణా పేరుతో రాత్రి వేళల్లో అక్రమ వ్యాపారం సాగిస్తున్నారు. స్థానిక ఎమ్మెల్యే బినామీగా ఉన్న పొదలకూరు మండలం నల్లపాళెంకు చెందిన ఓ చోటా నేత కనుసన్నల్లో అక్రమ రవాణా జరుగుతోంది. సదరు నేత డంపింగ్ యార్డు వద్ద సీసీ కెమెరాలు పెట్టి తన ఫోన్‌కు అనుసంధానం చేసుకున్నాడు. ప్రతి రోజు అనధికారికంగా వంద టిప్పర్లకు పైగా అక్రమంగా తరలిస్తున్నారు. పది టైర్ల లారీకి రూ.10 వేలు, పన్నెండు టైర్ల లారీకి రూ.15 వేలు వంతున వసూలు చేస్తున్నాడు. ఈ లెక్కన ఒక్క సూరాయపాళెం రీచ్ నుంచే వంద టిప్పర్లకు రోజుకు రూ.15 లక్షల ఇసుక వ్యాపారం జరుగుతున్నట్లు అంచనా.

పాట్టేపాళెం రీచ్‌లోకి నేరుగా..

నెల్లూరు రూరల్ మండలం పాట్టేపాళెం రీచ్‌కు ఎలాంటి అనుమతులు లేవు. స్థానిక ఎమ్మెల్యే అనుచరుడు పాట్టేపాళెంకు చెందిన ఓ చోటా నేత ఈ రీచ్‌ను గుత్తాధిపత్యంలోకి తీసుకున్నాడు. రీచ్‌లోకి నేరుగా వాహనాలు వెళ్లేందుకు వీలుగా రహదారి ఏర్పాటు చేసుకుని రెండు భారీ యంత్రాలను ఏర్పాటు చేశాడు. రాత్రి పది గంటలు దాటితే చాలు వందలాది టిప్పర్లు రీచ్‌లోకి బారులు తీరుతున్నాయి. యంత్రాల ద్వారా లోడింగ్ చేస్తున్నాడు. పది టైర్లకు రెండు రోజుల క్రితం వరకు రూ.10 వేలు వంతున వసూలు చేశాడు. ప్రస్తుతం డిమాండ్ పెరిగిందని రూ.15 వేలు లెక్కన వసూలు చేస్తున్నాడు. నిత్యం ఇక్కడి నుంచి 150 వరకు టిప్పర్లు, లారీల ఇసుక తరలివెళ్తోంది. రోజుకు సగటున రూ.22 లక్షల వరకు దోచుకుంటున్నారు. స్థానిక ఎమ్మెల్యే నుంచి అధికారుల వరకు భారీగానే ముడుపులు వెళ్తున్నాయనే ప్రచారం కూడా ఉంది.

కోవూరులో మూడు రీచ్‌లు

కోవూరు నియోజకవర్గంలోని మినగల్లు, ముదివర్తి, పోతిరెడ్డిపాళెం మూడు రీచ్‌లు ఎమ్మెల్యే కోటరీలోని ఓ సివిల్ కాంట్రాక్టర్ గుత్తాధిపత్యంలో ఉన్నాయి. ఆయా రీచ్‌ల నుంచి అనధికారికంగా రోజుకు రెండు వందలకు పైగా వాహనాలకు ఇసుక లోడింగ్ జరుగుతోంది. ప్రతి వాహనానికి రూ.10 వేలు వంతున వసూలు చేస్తున్నాడు. ఇందులో ఎమ్మెల్యే కోటరీలోని మరో నేతకు కూడా వాటా ఉందని బహిరంగంగానే ప్రచారం జోరుగా సాగుతుంది. సగటున రోజుకు రూ.35 లక్షల వరకు ఇసుక వ్యాపారం సాగిస్తున్నారు. అయితే స్థానిక ఎమ్మెల్యే మాత్రం అక్రమాలకు, అవినీతికి ఆస్కారం లేదంటూనే తన కోటరీలోని వ్యక్తులు బరితెగించి ఇసుక దోపిడీకి పాల్పడుతున్నా.. ఏమీ తెలియనట్లు వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు లేకపోలేదు.

పీకేపాడు నుంచి పక్క రాష్ట్రాలకు..

ఆత్మకూరు నియోజకవర్గంలోని పడమటి కంభంపాడు రీచ్ నుంచి పక్క రాష్ట్రాలకు ఇసుక అక్రమ రవాణా చేస్తున్నారు. రాత్రి వేళల్లో పది గంటల నుంచి టిప్పర్లు, లారీలకు లోడింగ్ చేస్తున్నారు. రెండు భారీ యంత్రాలు రీచ్‌లోనే ఉంచి తెల్లవారు జాము వరకు లోడింగ్ చేస్తున్నారు. ఆ రీచ్ నుంచి సోమశిల జలాశయం పక్కనే డంపింగ్ చేస్తూ అక్కడి నుంచి లోడింగ్ చేస్తున్నారు. టిప్పర్‌కు రూ.10 వేలు వంతున లోడింగ్ చార్జీలు వసూలు చేస్తున్నారు. కంభంపాడు నుంచి నిత్యం వంద వాహనాల్లో ప్రకాశం, కడప జిల్లాలతో పాటు తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాలకు తరలివెళ్తోంది. స్థానిక ఎమ్మెల్యే బినామీ గుత్తాధిపత్యంలో ఈ రీచ్ నడుస్తోంది.

విరువూరులో ఎమ్మెల్యే బినామీ దందా

విరువూరులో ఇసుక అక్రమ రవాణాకు సర్వం సిద్ధమైంది. జిల్లా అవసరాల పేరుతో స్థానిక ఎమ్మెల్యే బినామీకి 5 వేల టన్నుల తవ్వకానికి నామినేషన్ పద్ధతిలో విరువూరు రీచ్‌ను అప్పగించారు. ఇప్పటికే ఆ రీచ్‌లోకి ఇతరులు వెళ్లకుండా మూడు దారులు తవ్వేశారు. కేవలం తమకు సంబంధించిన వాహనాలు మాత్రమే వెళ్లేలా ఏర్పాటు చేసుకున్నారు. ఉచితం అంటూ ట్రాక్టర్ కూడా వెళ్లేందుకు లేకుండా చేశారు. ఒక వేళ ట్రాక్టర్ వెళ్లినా అక్కడ కప్పం కట్టాల్సిందే. అధికారికంగా కొంత అయితే.. అనధికారికంగా కొండంత తవ్వకాలు చేపడుతున్నారు.



చేజర్ల మండలం యనమదలలో ఇసుక డంపింగ్

సురక్షిత తాగునీరు అందించండి

- రాష్ట్రంలో అనేక జిల్లాల్లో కలుషిత నీటితో డయేరియా విజృంభణ
- సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చర్యలు చేపట్టండి
- అంగన్‌వాడీ భవనాల నిర్మాణాల్లో నిర్లక్ష్యం తగదు
- ఐసీడీఎస్ అధికారులపై అసహనం
- రైతులకు అందుబాటులో ఎరువులు, విత్తనాలు
- ప్రభుత్వ పాఠశాలల్లో పూర్తిస్థాయిలో వసతులు కల్పించండి
- జెడ్పీ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ



మాట్లాడుతున్న జెడ్పీ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ

నెల్లూరు (పొగతోట): రాష్ట్రంలో అనేక జిల్లాల్లో మంచినీరు కలుషితమై ప్రజలు డయేరియా బారిన పడుతున్నారని, జిల్లాలో అక్కడక్కడ ఇలాంటి పరిస్థితి ఉందని అప్రమత్తంగా ఉండి ప్రజలకు సురక్షితమైన మంచినీరు సరఫరా చేసేలా చర్యలు చేపట్టాలని జెడ్పీ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ అధికారులను ఆదేశించారు. శనివారం జెడ్పీ కార్యాలయంలో నిర్వహించిన స్థాయీ సంఘాల సమావేశాల్లో చైర్‌పర్సన్ మాట్లాడారు. చాలా చోట్ల పైపులైన్లు పగిలి మంచినీరు కలుషితమవుతుందన్నారు. కాలువల్లో పూడిక తీసి మురుగునీరు నిల్వ ఉండకుండా చర్యలు చేపట్టాలన్నారు. దోమల నివారణకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలన్నారు. పీహెచ్‌సీల్లో వైద్యులు అందుబాటులో ఉండాలన్నారు. అవసరమైన మందులు నిల్వ ఉంచుకోవాలని సూచించారు.

నాడు–నేడు పనుల్లో జాప్యంపై విచారం

పాఠశాలల్లో పూర్తిస్థాయిలో సౌకర్యాలు లేక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని జెడ్పీ చైర్‌పర్సన్ విచారం వ్యక్తం చేశారు. నాడు–నేడు పనుల ద్వారా రాపూరు, ఉదయగిరి, సీతారామపురం తదితర దూర ప్రాంతాల్లో పాఠశాలలను అద్భుతంగా తీర్చిదిద్దారన్నారు. నాడు–నేడు నిధులు కేటాయించినా.. నగర సమీపంలో ఉండే పాఠశాలల్లో మాత్రం సౌకర్యాలు కల్పించడంలో అధికారులు విఫలమయ్యారన్నారు. బెంచీలు, బాత్‌రూమ్‌లు లేక విద్యార్థులు ఇబ్బందులు పడుతుంటే ఎంఈఓలు ఏం చేస్తున్నారంటూ ప్రశ్నించారు. ప్రభుత్వ పాఠశాలల్లో పూర్తి స్థాయిలో సౌకర్యాలు కల్పించేలా చర్యలు తీసుకోవాలన్నారు.

స్థానిక ప్రజాప్రతినిధులకు ప్రొటోకాల్ గౌరవం

మండలాల్లో పనుల ప్రారంభోత్సవాలకు సంబంధించి ప్రొటోకాల్ పాటించి జెడ్పీటీసీ సభ్యులకు సమాచారం ఇచ్చి ఆహ్వానించి గౌరవించాలని తెలిపారు. 15వ ఆర్థిక సంఘం నిధులను సక్రమంగా ఖర్చు చేసి అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టాలన్నారు. చింతారెడ్డిపాళెం, చిన్న చెరుకూరు, కావలి, పెద్దపాడు, తదితర గ్రామాల్లో ఇంటర్నల్ రోడ్లు పూర్తిస్థాయిలో దెబ్బతిన్నాయన్నారు. మరమ్మతులు చేపట్టేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. గతంలో పంచాయతీరాజ్ శాఖ ద్వారా అనుమతులు ఇచ్చిన పనులను ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలన్నారు.

జాబ్‌మేళాలతో నిరుద్యోగులకు ఉపాధి

జిల్లాలో తరచూ జాబ్‌మేళాలు నిర్వహించి ఉద్యోగావకాశాలు కల్పించేలా చర్యలు తీసుకోవాలన్నారు. మేళాలు నిర్వహించే సమయం, తేదీలను జిల్లా పరిషత్ సభ్యులకు తెలియజేయాలన్నారు. పరిశ్రమల శాఖ ద్వారా అమలవుతున్న పీఎం విశ్వకర్మ పథకంపై ప్రజలకు పూర్తిస్థాయిలో అవగాహన కల్పించాలన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో చేతి వృత్తిదారులు సచివాలయాల ద్వారా దరఖాస్తులు చేసుకోవాలన్నారు.

మరికొన్ని విషయాలపై సమగ్రంగా

వివిధ రంగాలపై జెడ్పీ చైర్‌పర్సన్ సమగ్రంగా చర్చించారు. సోలార్ విద్యుత్‌పై ప్రజలకు పూర్తిస్థాయిలో అవగాహన కల్పించాలన్నారు. వ్యవసాయ శాఖ ద్వారా రైతులు ఇబ్బందులు పడకుండా విత్తనాలు, ఎరువులు సకాలంలో సరఫరా చేయాలన్నారు. చివరి భూముల వరకు సాగునీరు అందించేలా అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ఉపాధి హామీ పథకం ద్వారా జిల్లాలో 30 లక్షల మొక్కలు నాటే కార్యక్రమం సక్రమంగా అమలు జరిగేలా చూడాలన్నారు. ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ విద్య, వైద్యానికి పెద్ద పీట వేయాలన్నారు. జిల్లాలో కేన్సర్ రోగులు అధికంగా ఉన్నారన్నారు. వారికి నెల్లూరు జీజీహెచ్‌లో వైద్య సేవలు అందించేలా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో పూర్తి స్థాయిలో సౌకర్యాలు కల్పించి విద్యార్థుల సంఖ్యను పెంచాలన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో మంచినీటి పథకాలు మరమ్మతులకు గురయ్యాయని, వాటిని యుద్ధ ప్రాతిపదికన మరమ్మతులు చేపట్టి విద్యార్థులకు అందుబాటులోకి తీసుకురావాలన్నారు. ఎంఈఓ కార్యాలయాల్లో ఉపాధ్యాయులతో పనిచేయించడం సరికాదన్నారు. ఈ విధానానికి స్వస్తి పలకాలని సూచించారు. పార్టీలు, ప్రభుత్వాలు పక్కన పెట్టి ప్రజలకు సేవ చేయాలన్నారు. పొరపాట్లు జరుగుతుంటాయి, వాటిని సవరించుకుని ప్రజలకు అత్యుత్తమ సేవలు అందించేలా అధికారులు పనిచేయాలని తెలిపారు. ఈ సమావేశాల్లో జెడ్పీ సీఈఓ మోహన్‌రావు, ఎమ్మెల్సీ కళ్యాణ్ చక్రవర్తి, ఆయా స్థాయీ సంఘాల సభ్యులు, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

ఐసీడీఎస్ అధికారులపై అసహనం

జిల్లాలో 43 అంగన్‌వాడీ కేంద్రాల భవనాల నిర్మాణానికి నిధులు గత ప్రభుత్వం మంజూరు చేసిందన్నారు. ఒక్కొక్క భవన నిర్మాణానికి రూ.13 లక్షల సరిపోకపోతే రూ.16 లక్షలకు పెంచామన్నారు. ఆ నిధులు కూడా సరిపోకపోతే మండల పరిషత్ నుంచి నిధులు కేటాయిస్తామన్నారు. అయినా ఐసీడీఎస్ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారన్నారు. అద్దె భవనాల్లోనే అంగన్‌వాడీ కేంద్రాలు కొనసాగిస్తూ మంజూరైన నిధులు నిరుపయోగమయ్యేలా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని అసహనం వ్యక్తం చేశారు. ముగ్గురు పిల్లలు ఉండే అంగన్‌వాడీ కేంద్రాలకు టీచర్, ఆయా ఎందుకని ఐసీడీఎస్ పీడీని ప్రశ్నించారు. పీడీ సక్రమంగా విధులు నిర్వహించి అంగన్‌వాడీ కేంద్రాలపై ఆకస్మిక తనిఖీలు చేసి నిర్లక్ష్యంగా వ్యవహరించేవారిపై చర్యలు తీసుకోవాలని సూచించారు.



రాళ్లపాడు పాత స్పిల్‌వే గేటు ద్వారా లీకవుతున్న నీరు

రాళ్లపాడు స్పిల్ వేకు లీకులు

- వృథాగా పోతున్న నీరు
- ఆందోళనలో రైతాంగం

లింగసముద్రం: రాళ్లపాడు స్పిల్ వే గేట్ల వద్ద లీకేజీ కావడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ప్రాజెక్ట్ పాత స్పిల్‌వేలో పది పెద్ద గేట్లు, రెండు బురద గేట్లు ఉన్నాయి. ఈ గేట్లు 15 ఏళ్ల నుంచి వినియోగంలో లేకపోవడంతో తుప్పు పట్టి ఇరుక్కుపోయాయి. ఇటీవల కురిసిన వర్షాలకు ప్రాజెక్ట్‌కు 17.3 అడుగుల మేర నీరు చేరింది. అయితే పాత స్పిల్‌వే గేట్ల ద్వారా లీకేజీ రూపంలో నీళ్లు పోతున్నాయి. రెండేళ్ల నుంచి వర్షాలు సక్రమంగా కురవకపోవడంతో వరి పంట పండలేదు. ఈ సంవత్సరం ముందుగానే వర్షాలు కురవడంతో పాటు ప్రాజెక్ట్‌కు వరదనీరు వచ్చి 17.3 అడుగులకు చేరడంతో రైతులు నాట్లు వేసేందుకు సమాయత్తం అవుతున్నారు. అయితే లీకేజీ రూపంలో పాత స్పిల్‌వే గేట్ల ద్వారా నీరు మన్నేరుకు పోతుండడంతో వరి పంట పండుతుందా లేదా అని ఆందోళన చెందుతున్నారు. వర్షాలు కురిసి ప్రాజెక్ట్‌కు 21 అడుగుల పూర్తి నీటి సామర్థ్యంతో నిండితే గానీ వరి పంట పండుతుందని రైతులు చెబుతున్నారు. సోమశిల జలాలు కూడా 300 క్యూసెక్కులకు తగ్గకుండా ప్రాజెక్ట్‌కు చేరితే ఇబ్బంది ఉండదంటున్నారు. అధికారులు స్పందించి గేట్ల లీకేజీని అరికట్టకపోతే ఈ ఏడాది కూడా సాగుకు ఇబ్బందులు తప్పవని ఆందోళన చెందుతున్నారు.

టిడ్కో లబ్ధిదారులకు నోటీసులు

- నివాసాలు పొందేందుకు నిరాసక్తత
- రద్దు చేస్తామంటూ మున్సిపల్ అధికారుల హెచ్చరిక

కందుకూరు: ప్రధానమంత్రి ఆవాస్ యోజన (అర్బన్)–ఎన్టీఆర్ నగర్‌లో జీ+3 గృహాలు పొందిన కొందరు లబ్ధిదారులు వాటిని తీసుకునేందుకు ముందుకు రావడం లేదు. దీంతో సదరు లబ్ధిదారుల గృహాలను రద్దు చేస్తామంటూ మున్సిపల్ అధికారులు లబ్ధిదారులకు నోటీసులు జారీ చేశారు. సమ్మర్ స్టోరేజ్ ట్యాంకు సమీపంలో 300 చదరపు అడుగులు, 365 చదరపు అడుగులు, 430 చదరపు అడుగుల విస్తీర్ణంలో ఇళ్లు నిర్మించారు. వీటిలో 300 చదరపు అడుగుల విస్తీర్ణం ఇల్లు ఉచితంగా ఇస్తుండగా, 365, 430 చదరపు అడుగుల విస్తీర్ణం అయితే రూ. 50,000 చొప్పున ముందుగా కమిషనర్ పేరున చెల్లించాల్సి ఉంది. దీంతో పాటు లబ్ధిదారుడు బ్యాంకు రుణాలను తీసుకోవాల్సి ఉంది. అయితే ఆయా కేటగిరీల కింద ఇళ్లు మంజూరైన 90 మంది ఇప్పటి వరకు వారి వాటాను చెల్లించకపోగా, బ్యాంకు రుణాల ప్రక్రియను పూర్తి చేయలేదు. దీంతో సదరు లబ్ధిదారులకు ఇప్పటికే నోటీసులు ఇవ్వడంతో పాటు, పత్రిక ప్రకటన ద్వారా తెలియజేశారు. అయినా ఆ 90 మంది వాటా చెల్లించేందుకు ముందుకు రావడం లేదు. దీంతో వారికి కేటాయించిన ఇళ్లను రద్దు చేసేందుకు నిర్ణయం తీసుకున్నారు. ఈ నేపథ్యంలో వీరికి చివరి అవకాశంగా మరో 7 రోజులు గడువు ఇస్తున్నామని, ఏడు రోజుల లోపల మున్సిపాలిటీలో సంప్రదించి లబ్ధిదారుడి వాటాను చెల్లించవచ్చని సూచించారు. ఒక వేళ ఈ ఏడు రోజుల లోపల నోటీసులు అందుకున్న వారు ఇళ్లను తీసుకునేందుకు ముందుకు రాకపోతే శాశ్వతంగా వారికి కేటాయించిన ఇంటిని రద్దు చేస్తామని కమిషనర్ కె. అనూష తెలిపారు. రద్దు చేసిన ఇళ్లను అర్హులైన కొత్త లబ్ధిదారులను గుర్తించి వారికి కేటాయిస్తామని వివరించారు.

సత్సంబంధాలను నెలకొల్పడమే ఓపెన్ హౌస్ లక్ష్యం



పోలీస్ జాగిలం నుంచి గౌరవ వందనాన్ని స్వీకరిస్తున్న కృష్ణకాంత్



ఆయుధాల పనితీరును తెలియజేస్తున్న పోలీసులు

• ఎస్పీ కృష్ణకాంత్

నెల్లూరు సిటీ: ప్రజలు.. పోలీసుల మధ్య సత్సంబంధాలు నెలకొల్పడమే ఓపెన్ హౌస్ కార్యక్రమ ప్రధాన లక్ష్యమని ఎస్పీ కృష్ణకాంత్ పేర్కొన్నారు. పోలీస్ అమరవీరుల సంస్మరణ వారోత్సవాలను పురస్కరించుకొని నగరంలోని పోలీస్ పరేడ్ గ్రౌండ్స్‌లో ఓపెన్ హౌస్ కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. దాదాపు 800 మంది విద్యార్థులు హాజరయ్యారు. వీరితో ముచ్చటించి.. ఆయుధాలు, పరికరాల పనితీరు.. పోలీస్ శాఖకు సంబంధించిన పలు అంశాలపై ఎస్పీ అవగాహన కల్పించారు. స్నిఫర్ డాగ్ స్వీటీ, ట్రాకర్ డాగ్ రాక్సీ చేసిన స్క్వాడ్ విన్యాసాలు, గౌరవ వందనాన్ని ఆసక్తిగా తిలకించారు. బాంబ్ డిస్పోజల్ టీమ్ పరికరాలు, డ్రోన్లు, డాగ్ స్క్వాడ్ బృందాల పనితీరు తదితరాలను తెలియజేసిన అనంతరం ఆయన మాట్లాడారు. సత్ప్రవర్తనతో జీవించి, ఉన్నత స్థాయికి ఎదిగి ప్రజలకు సేవలందించాలని పిలుపునిచ్చారు. ఇలాంటి కార్యక్రమాలు పిల్లలకు ఎంతో ఉపయోగపడతాయని చెప్పారు. ఏఎస్పీలు సౌజన్య, మునిరాజా తదితరులు పాల్గొన్నారు.

క్షయరహిత జిల్లాగా మారుద్దాం

• కలెక్టర్ ఆనంద్



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ ఆనంద్

నెల్లూరు(దర్గామిట్ట): జిల్లాను క్షయ రహితంగా మార్చేందుకు వైద్య ఆరోగ్య సిబ్బంది బాధ్యతాయుతంగా పనిచేయాలని కలెక్టర్ ఓ ఆనంద్ పేర్కొన్నారు. కలెక్టరేట్లోని తిక్కన ప్రాంగణంలో శనివారం నిర్వహించిన జిల్లాస్థాయి టీబీ ఫోరం సమావేశంలో ఆయన మాట్లాడారు. దేశంలో 2025 నాటికి టీబీని నివారించడంతో పాటు ఒక్క మరణం సంభవించకూడదనే విజన్‌తో ప్రభుత్వం పనిచేస్తోందని తెలిపారు. తొలుత జిల్లాలో క్షయ వ్యాధి నివారణకు చేపడుతున్న చర్యలను పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా జిల్లా క్షయ నివారణాధికారి ఖాదర్‌వలీ వివరించారు. ప్రతి టీబీ పేషెంట్‌కు చికిత్స కాలంలో నెలకు రూ.500ను అందజేస్తున్నామని వెల్లడించారు. అనంతరం ఇండియన్ మెడికల్ అసోసియేషన్ జిల్లా కో ఆర్డినేటర్ డాక్టర్ అశోక్ మాట్లాడారు. పాఠశాలలు, కళాశాలల విద్యార్థులకు టీబీ గళ్ల పరీక్షలు చేయించాలని సూచించారు. డాక్టర్ భవానీ, జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ కో ఆర్డినేటర్ రమేష్ నాథ్, ఇండియన్ మెడికల్ అసోసియేషన్ ప్రెసిడెంట్ అమరేంద్రరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పౌల్ట్రీ ధరలు



బ్రాయిలర్:	రూ.132
లేయర్	రూ.110
బ్రాయిలర్ చికెన్:	రూ.236
స్కిన్‌లెస్ చికెన్:	రూ.262
లేయర్ చికెన్:	రూ.187

నిమ్మ ధరలు (కిలో)

పెద్దవి : రూ.35 సన్నవి : రూ.20
పండ్లు : రూ.10

క్లుప్తంగా

ధర్నాను విజయవంతం చేసిన అందరికీ ధన్యవాదాలు: కాకాణి

నెల్లూరు(బారకాసు): ఉచిత ఇసుక పేరుతో సీఎం చంద్రబాబు, ప్రభుత్వం చేస్తున్న మోసాలపై వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో నగరంలో శుక్రవారం నిర్వహించిన ర్యాలీ, ధర్నాకు పెద్ద ఎత్తున హాజరై విజయవంతం చేసిన అందరికీ మాజీ మంత్రి, పార్టీ జిల్లా అధ్యక్షుడు కాకాణి గోవర్ధన్‌రెడ్డి ధన్యవాదాలు తెలియజేశారు. ఈ మేరకు శనివారం ఒక ప్రకటనను విడుదల చేశారు. ప్రజలకిచ్చిన హామీలను ప్రభుత్వం నెరవేర్చేలా భవిష్యత్తులో చేపట్టే పోరాటాల్లోనూ మీరంతా భాగస్వాములు కావాలని విజ్ఞప్తి చేశారు.

పది పరీక్ష ఫీజును 11లోపు చెల్లించాలి

నెల్లూరు (టౌన్): పదో తరగతి పబ్లిక్ పరీక్షలకు సంబంధించిన ఫీజును వచ్చే నెల 11లోపు చెల్లించాలని డీఈఓ ఆర్ బాలాజీరావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. రూ.50 అపరాధ రుసుముతో వచ్చే నెల 18 వరకు, రూ.200 అపరాధ రుసుముతో 25 వరకు, రూ.500 అపరాధ రుసుముతో 30 వరకు అవకాశం ఉందన్నారు. రెగ్యులర్ విద్యార్థులు అన్ని సబ్జెక్టులకు రూ.125, ప్రైవేట్ విద్యార్థులు మూడు సబ్జెక్టులకు రూ.110, ఆపైన రూ.125 చెల్లించాలన్నారు.

ఎన్టీఆర్ వైద్యసేవ కోఆర్డినేటర్‌గా సుధీర్‌కుమార్



కలెక్టర్‌ను కలిసిన సుధీర్‌కుమార్

నెల్లూరు(అర్బన్): ఎన్టీఆర్ వైద్యసేవ జిల్లా కో ఆర్డినేటర్‌గా డాక్టర్ సుధీర్‌కుమార్‌ను నియమిస్తూ ఉత్తర్వులను ప్రభుత్వం జారీ చేసింది. ఇక్కడ కోఆర్డినేటర్‌గా ఉన్న డాక్టర్ చంద్రశేఖర్‌ను విజయవాడకు నెల క్రితం బదిలీ చేశారు. అప్పటి నుంచి జిల్లా కోఆర్డినేటర్‌గా ప్రకాశం జిల్లా కో ఆర్డినేటర్ వ్యవహరిస్తున్నారు. ఈ నేపథ్యంలో నెల్లూరు జిల్లా ఆర్బీఎస్కే ప్రోగ్రామ్ ఆఫీసర్‌గా విధులు నిర్వర్తిస్తున్న సుధీర్‌కుమార్‌ను నియమించారు. బాధ్యతలను శనివారం స్వీకరించిన అనంతరం కలెక్టర్ ఆనంద్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఆయనకు పలువురు శుభాకాంక్షలను తెలియజేశారు.

విద్యుత్ బిల్లులను నేడూ చెల్లించొచ్చు

నెల్లూరు(వీఆర్సీసెంటర్): విద్యుత్ బిల్లులను ఆదివారం యథావిధిగా చెల్లించొచ్చని ఎస్పీడీసీఎల్ జిల్లా సర్కిల్ ఎస్ఈ విజయన్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని అన్ని విద్యుత్ బిల్లుల వసూలు కేంద్రాలు పనిచేయనున్నాయని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

విదేశాంగ శాఖ కన్సల్టేటివ్ కమిటీ సభ్యుడిగా వేమిరెడ్డి

నెల్లూరు(దర్గామిట్ట): కేంద్ర విదేశాంగ శాఖ కన్సల్టేటివ్ కమిటీలో సభ్యుడిగా నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి నియమితులయ్యారు. తెలుగు రాష్ట్రాల నుంచి ఈయనకు మాత్రమే ఈ అవకాశం లభించింది. కాగా తనకు బాధ్యతను అప్పగించిన కేంద్ర ప్రభుత్వానికి ఆయన కృతజ్ఞతలను తెలియజేశారు.

ఉచిత వినికిడి యంత్రాలకు వివరాల నమోదు రేపు

నెల్లూరు(అర్బన్): పద్దెనిమిదేళ్లలోపు పిల్లలకు అవసరమైన వినికిడి యంత్రాలను ఉచితంగా అమర్చేందుకు గానూ వివరాలను నగరంలోని ప్రభుత్వ సర్వజన ఆస్పత్రి ఆవరణలో గల బాల భవిత కేంద్రంలో సోమవారం నమోదు చేయనున్నామని డీఎంహెచ్ఓ పెంచలయ్య శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ, దీన్‌దయాళ్ శరవణ ఫౌండేషన్ ఆధ్వర్యంలో కార్యక్రమాన్ని నిర్వహించనున్నామని చెప్పారు. పరీక్షలు చేసి లోపం ఉన్న పిల్లలకు డిసెంబర్‌లోపు వినికిడి యంత్రాలను ఉచితంగా అమర్చుతామని పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని, వివరాలకు 93814 68458 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

మళ్లీ స్కెచ్ వేశారు

• క్వార్ట్జ్ లీజులకు పన్నాగం
• ప్రత్యేక బృందాల తనిఖీలు

నెల్లూరు(సెంట్రల్): జిల్లాలో అధికారికంగా క్వార్ట్జ్ దోపిడీకి టీడీపీ మరోసారి పెద్ద స్కెచ్ వేసింది. జిల్లాలో గతంలో ఎక్కడెక్కడ వాటిని లీజుకు తీసుకున్నారు.. ప్రస్తుతం అవి ఏ పరిస్థితుల్లో ఉన్నాయనే అంశాలను ఆరా తీస్తున్నారు. లీజులను తమకే ఇవ్వాలంటూ అధికారులపై అధికార పార్టీ ప్రజాప్రతినిధులు తీవ్ర ఒత్తిడి తేవడంతో ఎట్టకేలకు తలొగ్గారు. ప్రధానంగా అధికార పార్టీ ప్రజాప్రతినిధుల అనుచరులకే ఇచ్చేలా పెద్ద స్కెచ్‌ను నడుపుతున్నారు.

ఐదుగురితో కూడిన కమిటీ

జిల్లాలో క్వార్ట్జ్ పరిశీలనకు విజయవాడ మైనింగ్ కార్యాలయం నుంచి ఐదుగురితో కూడిన ప్రత్యేక బృందం నెల్లూరుకు శనివారం చేరుకుంది. జిల్లాలోని పలు క్వార్ట్జ్ గనులను ఆదివారం నుంచి పరిశీలించనున్నారు. ప్రస్తుతం వీటి పరిస్థితి.. ఎంత మేర తీసుకునేందుకు వీలుంటుంది.. ఎవరి ఆధీనంలో ఉంది.. తదితర వివరాలను సేకరించనున్నారు. విజయవాడ నుంచి వచ్చిన ప్రత్యేక బృందాన్ని ప్రసన్నం చేసుకునేందుకు శనివారం ఉదయం నుంచే పలువురు అధికార పార్టీ నేతలు యత్నాలు చేస్తున్నారు. తమ వారికే అనుకూలంగా రిపోర్టు వచ్చేలా చూడాలని జిల్లా మైనింగ్ అధికారికి అధికార పార్టీ ప్రజాప్రతినిధులు సూచించారని సమాచారం.

ఉపాధ్యాయుల పాత్ర కీలకం



మాట్లాడుతున్న పద్మావతి

నెల్లూరు(దర్గామిట్ట): బాలల హక్కులను పరిరక్షించే ప్రధాన భూమిక ఉపాధ్యాయులదేనని బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ రాష్ట్ర సభ్యురాలు పద్మావతి పేర్కొన్నారు. జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు, కళాశాలల్లో బాలల హక్కుల పరిరక్షణ అమలవుతున్న తీరుపై నగరంలోని కస్తూర్బా కళాక్షేత్రంలో శనివారం నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆమె మాట్లాడారు. పిల్లలను ఒత్తిడికి గురిచేయకుండా చదువుతో పాటు క్రీడలు, నాయకత్వ లక్షణాలు, సృజనాత్మకత పెంపొందించేలా తయారు చేయాలని సూచించారు. మార్కులు తదితర అంశాల్లో ఇతరులతో పోల్చకుండా వారి వ్యక్తిగత సామర్థ్యాల మేరకు రాణించేలా తీర్చిదిద్దాలని కోరారు. కేవలం ఇంజినీర్, డాక్టర్ మాత్రమే కాదని, అనేక రంగాల్లో మంచి అవకాశాలున్నాయనే అంశాన్ని పాఠశాల దశలోనే తెలియజేయాలని సూచించారు. మొబైల్ ఫోన్ల ప్రభావం పిల్లలపై గణనీయంగా తగ్గించేందుకు కృషి చేయాలన్నారు. గుడ్.. బ్యాడ్ టచ్‌పై అవగాహన కల్పించాలని చెప్పారు. ఫ్రెండ్లీ టీచర్ కాన్సెప్టును అభివృద్ధి చేయడంతో పాటు పేరెంట్స్ కమిటీ సమావేశాలను ప్రతి నెలా తప్పక నిర్వహించాలన్నారు. ప్రభుత్వ హాస్టళ్లలో యోగాను నేర్పడాన్ని జిల్లా నుంచే శ్రీకారం చుట్టామని వెల్లడించారు. తొలుత డీఈఓ బాలాజీరావు, ఆర్ఐఓ శ్రీనివాసులు, సమగ్ర శిక్ష ఏపీసీ ఉషారాణితో కలిసి పద్మావతి జ్యోతి ప్రజ్వలన చేశారు. డీవీఈఓ మధుబాబు, డీసీఓ జయలక్ష్మి, డీసీపీఓ సురేష్, డిప్యూటీ ఈఓలు ప్రసన్నలక్ష్మి, గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

మద్యం దుకాణాలను తరలించాల్సిందే



సీపీఎం, ఐద్వా నేతల ర్యాలీ

నెల్లూరు(వీఆర్సీసెంటర్): నగరంలో జనావాసాల మధ్య ఏర్పాటు చేసిన వైన్ షాపులను మరో చోటకు తరలించాల్సిందేనని సీపీఎం నేతలు డిమాండ్ చేశారు. ఈ మేరకు నగరంలో భారీ ర్యాలీని పార్టీ ఆధ్వర్యంలో శనివారం చేపట్టారు. గాంధీబొమ్మ నుంచి వీఆర్సీ సెంటర్ వరకు నిర్వహించిన ర్యాలీలో పార్టీ నగర కార్యదర్శి కత్తి శ్రీనివాసులు, ఐద్వా జిల్లా కార్యదర్శి మస్తాన్‌బీ మాట్లాడారు. నూతన మద్యం పాలసీ ద్వారా జనావాసాల మధ్య వైన్ షాపులను ఏర్పాటు చేయడం దుర్మార్గమని చెప్పారు. వెంకటేశ్వరపురం, శ్రీనివాసనగర్, జగదీష్‌నగర్‌లో జనావాసాల మధ్య.. ఆత్మకూరు బస్టాండ్ సమీపంలోని ప్రార్థన మందిరం వద్ద వీటిని ఏర్పాటు చేసిన అంశాన్ని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లామని చెప్పారు. అధికార పార్టీ నేతలు, మద్యం కాంట్రాక్టర్లు, సిండికేట్లకు పోలీసులు, అధికారులు మద్దతివ్వడం సిగ్గుమాలిన చర్యగా అభివర్ణించారు. రూ.99కే నాణ్యమైన మద్యాన్ని ఎలా అందిస్తారని ప్రశ్నించారు. మద్యం దుకాణాలకు వ్యతిరేకంగా పోరాడుతున్న మహిళలపై లాఠీచార్జి చేస్తామని.. కేసులు బనాయించి జైళ్లలో పెడతామని పోలీసులు బెదిరిస్తుండటం ఎంత వరకు సబబని ప్రశ్నించారు. నగరంలోని నాలుగు మద్యం దుకాణాలను ఇతర ప్రాంతాలకు తరలించకపోతే పోరాటాన్ని ఉధృతం చేస్తామని స్పష్టం చేశారు. సీపీఎం నగర కార్యదర్శివర్గ సభ్యులు నాగేశ్వరరావు, సూర్యనారాయణ, కాయం శ్రీనివాసులు, నగర కమిటీ సభ్యులు నరసింహ, చంద్రారెడ్డి, సుబ్బమ్మ, మూలం ప్రసాద్, ఫయాజ్, శ్రీనివాసులురెడ్డి, చెంగయ్య, తదితరులు పాల్గొన్నారు.

జోయాలుక్కాస్‌లో 'జాయ్ వాలీ దివాలీ'



ఆఫర్ పోస్టర్లను ఆవిష్కరిస్తున్న అతిథులు

నెల్లూరు(బృందావనం): నగరంలోని అన్నమయ్య సర్కిల్ సమీపంలో గల జోయాలుక్కాస్ జ్యువెలరీ స్టోర్‌లో 'జాయ్ వాలీ దివాలీ' ఆఫర్‌ను శనివారం ఆవిష్కరించారు. ముఖ్యఅతిథిగా బాబు ఐస్‌క్రీమ్స్ అధినేత పొన్నేరి హరికృష్ణ హాజరయ్యారు. తొలుత కేక్‌ను కట్ చేశారు. ఈ సందర్భంగా స్టోర్ మేనేజర్ అక్రమ్ మహమ్మద్, అసిస్టెంట్ మేనేజర్ ప్రశాంత్ మాట్లాడారు. ఆఫర్‌లో భాగంగా ప్రతి రూ.50 వేల బంగారం కొనుగోలుపై రూ.వెయ్యి గిఫ్ట్ వోచర్.. ప్రతి రూ.లక్ష డైమండ్ ఆభరణాల కొనుగోలుపై గ్రామ్ గోల్డ్ కాయిన్‌ను ఉచితంగా అందజేయనున్నామని వెల్లడించారు. ప్రతి రూ.పది వేల వెండి వస్తువుల కొనుగోలుపై రూ.500 గిఫ్ట్ వోచర్‌ను అందజేయనున్నామని, ఈ ఆఫర్లు నవంబర్ మూడు వరకే ఉంటాయని వివరించారు.